క్లుప్తంగా

ఎస్పీఎఫ్ ఎస్ఐ కోటేష్‌కు ఇండియన్ పోలీస్ మెడల్



లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ పరిధిలోని ఎస్పీఎఫ్ విభాగంలో ఎస్ఐగా పనిచేస్తున్న కొత్తకోట కోటేష్‌కు ఇండియన్ పోలీస్ మెడల్ లభించింది. శ్రీకాకుళం జిల్లా పెద్దపద్మాపురానికి చెందిన కోటేష్ 19వ ఏట 1987లో బీఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా చేరి 1993 వరకూ సేవలందించారు. అనంతరం పర్మినెంట్ ట్రాన్స్‌ఫర్‌తో ఏపీ ఎస్పీఎఫ్ విభాగానికి వచ్చారు. నాటి నుంచి టీటీడీ దేవస్థానంతో పాటు పలు యూనిట్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఎస్ఐగా విధులు నిర్వహిస్తుండగా, ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ పోలీస్ మెడల్‌ను ప్రకటించింది.

కొత్తపేటలో కూలిన రిటైనింగ్‌వాల్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):నగరంలో కురుస్తున్న వర్షాలతో బుధవారం కొత్తపేట కొండ ప్రాంతంలో ఒక రిటైనింగ్ వాల్ కూలింది. స్థానిక 51 డివిజన్‌లో పితాని అప్పలస్వామి వీధి కొండపైన రిటైనింగ్ వాల్ కూలిపోవడంతో స్థానికులు కార్పొరేటర్‌కు సమాచారం అందించారు. ఆ ప్రాంతాన్ని కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ సందర్శించి నగర పాలక సంస్థ అధికారులకు తెలియజేశారు. అధికారులు కొండపైన కూలిన రిటైనింగ్ వాల్‌ను పరిశీలించారు. మట్టిని వీలైనంత త్వరగా తొలగింపజేసి స్థానికులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు. అలాగే పశ్చిమ తహసీల్దార్‌కు వివరించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా చూడాలని కోరారు. అక్కడి నుంచి పడాల వారి వీధిలోని కొండపైన మెట్లు పాడైపోవడంతో వాటిని వీలైనంత త్వరగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని, మంచినీటి పైపులైన్ వర్కులు కూడా త్వరగా చూసి స్థానికులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కార్పొరేటర్ అధికారులను కోరారు.

కృష్ణమ్మకు శాంతి పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):కృష్ణానది వరద నేపథ్యంలో దుర్గాఘాట్‌లో గురువారం శాంతి పూజలు నిర్వహించారు. వరద ప్రభావం తగ్గుముఖం పట్టి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండాలని లోక క్షేమాన్ని కాంక్షిస్తూ కృష్ణానదికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సుమంగళ ద్రవ్యాలను సమర్పించారు. తొలుత దుర్గాఘాట్‌లో ఆలయ అర్చకులు పూజలు చేయగా ఆలయ ఈవో శీనానాయక్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, పూజాద్రవ్యాలు, పట్టుచీరలను సమర్పించి, హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

27న వినాయక చవితి ఉత్సవం...

దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై 27వ తేదీన వినాయక చవితి ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజ స్వామి వారి ఆలయంతో పాటు, చిన్న రాజ గోపురం వద్ద శ్రీమహాగణపతి స్వామి వారి మందిరం వద్ద ఉత్సవాలను నిర్వహించనున్నామన్నారు. 29వ తేదీ ఉదయం 9-30 గంటలకు పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని, సాయంత్రం 5 గంటలకు మృత్తికా గణపతి విగ్రహం నిమజ్జన ఊరేగింపు జరుగుతుందని పేర్కొన్నారు.

రేపటి నుంచి ఉరుసు మహోత్సవం



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక స్వాతి సెంటర్‌లోని బాబాజీ హజరత్ సయ్యద్ అమీనుద్దీన్ చిష్తి ఔలియా దర్గా 41వ ఉరుసు (గంధం) మహోత్సవాన్ని శనివారం నుంచి మూడురోజులపాటు నిర్వహించనున్నట్లు సజ్జాదె నషీన్, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షా మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ చిష్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు పర్చం ఖుషాయ్ (ఉరుసు ప్రారంభోత్సవం) కార్యక్రమం ఉంటుందని, రెండవ రోజు ఆదివారం సాయంత్రం 6 గంటలకు భవానీపురంలోని బాబా దర్గా నుంచి గంధం ఊరేగింపు, చివరి రోజు సోమవారం దీపారాధన, సాయంత్రం ప్రసాదం పంపిణీ ఉంటాయన్నారు. రాత్రి 9 గంటలకు బాబాను కీర్తిస్తూ భక్తి గీతాలతో కూడిన ఖవ్వాలీ కార్యక్రమం ఉంటుందని వివరించారు.

బస్టాండ్ ఉన్నా.. నిరుపయోగమే!

- వర్షం వస్తే నెలల తరబడి బురద
- గ్రౌండ్ వరకే బస్సులు
- ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు



వర్షం నీటితో బురదగా మారిన కాలనీ బస్టాండ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జక్కంపూడి వైఎస్సార్ కాలనీ జేఎన్ఎన్‌యుఆర్ఎం పథకం కింద నిర్మించిన కాలనీల్లోనే అతి పెద్దది. వందలాది కుటుంబాలు నివాసం ఉంటున్న జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో కనీస సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాలనీలో నివాసం ఉండే వందలాది కుటుంబాలు తెల్లవారు లేచినప్పటి నుంచి పొట్ట చేత పట్టుకుని జీవనం కోసం నగరంలోకి పరుగులు పెడుతుంటారు. కాలనీకి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సర్వీసులు నడుపుతున్నారు. కాలనీ వాసుల సౌకర్యం కోసం బస్సులు నిలుపుకునేందుకు బస్టాండ్ ఉన్నా అది నిరుపయోగంగా మారింది. బస్టాండ్ ఆవరణ అంతా రాళ్లు, మట్టితో నిండి ఉండటం, బస్సులను ఆవరణలోకి తీసుకెళితే రాళ్లు బస్సుల అడుగు భాగంలో తగిలి మరమ్మతులకు గురవుతున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బస్టాండ్‌లోకి కనీసం ఒక్క బస్సు కూడా తీసుకువెళ్లేందుకు డ్రైవర్లు సుముఖత వ్యక్తం చేయడం లేదు. అయితే బస్టాండ్ సక్రమంగా లేకపోవడంతో స్థానికుల ఇబ్బందులు వర్ణనాతీతం.

వర్షం వస్తే బురదే....

కాలనీలో ఏర్పాటు చేసిన బస్టాండ్ గత కొంత కాలంగా పాలకుల నిర్లక్ష్యానికి గురవుతుంది. చిన్నపాటి వర్షం కురిసినా చాలు బస్టాండ్ ప్రాంతంలో నిలిచిపోయి బురదగా మారుతున్నాయి. దీంతో ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు రోడ్డుపైనే నిల్చోవాల్సి వస్తుంది. మరో వైపున బస్సు డ్రైవర్లు సైతం బస్టాండ్ వరకు రాకుండా కొద్ది దూరంలో ఉన్న గ్రౌండ్ వరకే బస్సులను నడుపుతున్నారు. దీంతో కాలనీ శివారు ప్రాంతాలకు చెందిన వారు గ్రౌండ్ వరకు నడవ లేక ఇంటి ముందుకు వస్తున్న ఆటోలను ఆశ్రయిస్తున్నారు. రాత్రి వేళలలో బస్టాండ్‌లో ఆటోలను నిలిపి అందులో అసాంఘీక కార్యకలాపాలను సాగిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

తుప్పు పట్టిన స్టాండ్లు, షెల్టర్...

ప్రయాణికుల రాకపోకలు లేకపోవడం, సరైన నిర్వహణ లేకపోవడంతో బస్ షెల్టర్, ప్రయాణికులు కూర్చునే స్టాండ్లు తుప్పు పట్టి పోయ్యాయి. బస్టాండ్ సక్రమంగా లేకపోవడంతో వచ్చే అరకొర బస్సులు కూడా లోపల వరకు రాకపోవడంతో ఇప్పుడు పూర్తిగా నిరుపయోగమైంది. రాత్రి వేళలలో బస్టాండ్‌ను మద్యం తాగేందుకు ఉపయోగిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ప్రయాణికులు కూర్చునే బల్లలు తుప్పు పట్టి విరిగిపోగా, షెల్టర్‌పై కప్పు తుప్పు పట్టి పనికిరాకుండా పోయింది. చుట్టు పక్కల చిన్నారుల కోసం షెల్టర్‌కు ఉన్న ఇనుప పైపులకు చీరలను ఉట్టి ఊయ్యాలలుగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు కాలనీలోని బస్టాండ్‌ను అభివృద్ధి చేసి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



షెల్టర్ పైపులకు ఉయ్యాలలు కట్టిన దృశ్యం

బస్టాండ్ వరకు వస్తే ప్రయోజనం



బస్సులు బస్టాండ్ వరకు వస్తే మాలాంటి వారికి ప్రయోజనం. గ్రౌండ్ వరకు బస్సులు వస్తున్నాయి. అక్కడే దిగిపోవాలని చెప్పడంతో ఇంటికి వెళ్లాలంటే దూరం నడుచుకుంటూ వెళ్లాలి.. లేదా ఆటో ఎక్కాలి...ఆర్టీసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు కాలనీలో బస్టాండ్ గురించి కాస్త ఆలోచన చేయాలి.

రాజారాం(జగన్)

బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలి



వేల కుటుంబాలు నివాసం ఉంటున్న కాలనీలో బస్టాండ్ పరిస్థితిపై అధికారులు దృష్టి పెట్టాలి. కాలనీ నుంచి కనీసం రోజూ కొన్ని వేల మంది పనుల కోసం వెళ్లి వస్తుంటారు. బస్టాండ్ అభివృద్ధి చేస్తే పరిసరాలు శుభ్రంగా ఉంటాయి. ఇప్పుడు వర్షం వస్తే నెలల తరబడి బురదగా ఉంటుంది.

ఖయూమ్

అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థతో అవస్థలు

- ఆరు బిల్డింగ్‌ల వద్ద పారిశుద్ధ్యం అధ్వానం
- వర్షం కురిసిందంటే భయం..భయం
- వీఎంసీ అధికారుల అనాలోచిత పనులతో ఇక్కట్లు



అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో కదలని మురుగునీరు



ఇంట్లోకి చేరిన మురుగునీరు, బురదను శుభ్రం చేసుకుంటున్న మహిళ

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోగల న్యూ లేబర్ కాలనీలోని ఆరు బిల్డింగ్‌ల ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షం కురిసిందంటే చాలు ఆరు బిల్డింగ్‌ల ముందున్న సైడు కాలువలన్నీ నిండిపోతున్నాయి. ఆయా బిల్డింగ్‌లు ముందున్న మెయిన్ రోడ్‌పై ఉన్న బాక్స్ కల్వర్ట్‌కు సమాంతరం ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో మురుగు నీరు ముందుకు ప్రవహిస్తేనే సైడు కాలువల్లో నీళ్లు కదులుతాయి. కాగా మొన్న మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఆరు బిల్డింగ్‌ల రోడ్ మొత్తం జలమయమైంది. ఇళ్లల్లోకి నీళ్లు కూడా వచ్చేసి నివాసితులు నానా ఇబ్బందులు పడ్డారు. గురువారం సైతం సైడు కాలువల్లో మురుగు నీరు అలానే ఉండిపోయింది. అలాగే బిల్డింగ్‌ల గ్రౌండ్ ఫ్లోర్‌లోకి చేరిన మురుగు నీరు ఎక్కడిదక్కడ నిలిచిపోయింది. ఆ మురుగు నీళ్లల్లో నుంచే నివాసితులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. మురుగు నీటితోపాటు బురద సైతం చేరటంతో దుర్వాసన వస్తుంది. గురువారం కొంచెం తెరిపివ్వడంతో నివాసితులు మురుగు నీటిని, బురదను శుభ్రం చేసుకుంటున్నారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల అనాలోచిత పనులతో వర్షం వచ్చినప్పుడల్లా తమకీ తిప్పలు తప్పటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైడు కాలువలు నిండిపోయి ఆరు బిల్డింగ్‌ల ఇవతల ఉన్న ఒక ఇంట్లోకి వచ్చేయడంతో ఆ ఇంటి యజమాని ఖాళీ చేసి కాలనీలోనే మరో ఇల్లు అద్దెకు తీసుకుని ఉండటం గమనార్హం.

సుదీర్ఘ ప్రయాణం...

ఆరు బిల్డింగ్‌ల ముందున్న రోడ్ మొదట్లో ఉన్న కచ్చా డ్రెయిన్ స్థానంలో సుమారు రెండు నెలల క్రితం పక్కా డ్రెయిన్ నిర్మించారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. ఈ అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోని మురుగు నీరు ముందుకు సాగుతూ కాలనీలోని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ వెనుక నుంచి ఏర్పాటు చేసిన సిమెంట్ పైపుల ద్వారా స్టేడియం చివరి వరకు వెళ్లి అక్కడ ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్ (బైపాస్ రహదారి పక్కన)లోకి చేరాలి. అక్కడి నుంచి కుడి వైపుగా వెళ్లి సితార జంక్షన్ మూలమీదున్న అవుట్‌ఫాల్ డ్రెయిన్ ద్వారా కబేళా రోడ్‌లోని డ్రెయిన్‌లో కలవాల్సి ఉంటుంది. అయితే ఇంత సుదీర్ఘ ప్రయాణంలో మురుగునీటి పారుదలకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి.

సిమెంట్ చప్టాలే కారణం....

బైపాస్ రోడ్ పక్కన ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌పై వ్యాపారస్తులు భారీగా కట్టిన సిమెంట్ చప్టాలే అందుకు కారణంగా నిలుస్తున్నాయి. వ్యాపారులు నిర్మించిన చప్టాల మధ్యలో అక్కడక్కడ డ్రెయిన్ శుభ్రం చేసేందుకు జల్లెడ వంటివాటిని ఏర్పాటు చేసినప్పటికీ అవి నామమాత్రంగానే మిగిలిపోయాయి. చప్టాల కింద చెత్తాచెదారం పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో మురుగునీటి పారుదల సక్రమంగా జరగటం లేదన్నది సుస్పష్టమవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆరు బిల్డింగ్‌ల్లో నివసిస్తున్నవారు కోరుతున్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు



స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో శుక్రవారం జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో ఎలాంటి అవాంతరాలు, సమస్యలు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న స్వాతంత్ర్య వేడుకల ఏర్పాటు, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో ప్రారంభించబోతున్న స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభ వేడుకల్లో కూడా సమస్యలు రాకుండా అధికారులు పటిష్ట ఏర్పాటు చేయాలని గురువారం చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. ఆయా కార్యక్రమాలకు విచ్చేసే ప్రజలందరికీ వీఎంసీ కల్పించే సౌకర్యాల్లో ఎటువంటి అసౌకర్యం కలిగించరాదన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యనారాయణ పి.సత్యకుమారి, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) పి.వెంకటనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.శ్రీనివాసరెడ్డి, జె.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి!

- అధికారుల అలసత్వంతో గోతులు తీసి వదిలేసిన వైనం
- వేసవిలో పూడికలు తీయడంలోనూ అలసత్వం
- అధికారుల తీరుపై విమర్శలు



ప్రమాదం జరిగిన స్థలంలోని గొయ్యి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):కూటమి పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో నిండు ప్రాణాలు బలవుతున్నాయి. పాతబస్తీ 53వ డివిజన్ గులాంమొహిద్దీన్ వీధిలో మంగళవారం అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మరమ్మతుల నిమిత్తం మూడు చోట్ల నగర పాలక సంస్థ సిబ్బంది సుమారు పది అడుగుల లోతు, 20 అడుగుల వెడల్పుతో కూడళ్ల వద్ద గోతులు తీశారు. తీసిన గోతుల వద్ద స్పష్టమైన అడ్డంకులు ఏమీ ఏర్పాటు చేయకుండా చిన్నపాటి హెచ్చరిక బోర్డుతో వదిలేశారు. గడిచిన నాలుగైదు రోజులుగా వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలు చేస్తూనే ఉన్నా అధికారులే పట్టించుకోకపోవటం దారుణమని స్థానికులు మండి పడుతున్నారు. వర్షం వస్తే ఆ ప్రాంతాలు వర్షపునీటితో మునిగిపోతాయని తెలిసి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో పూడికలు తీయడంలోనూ నిర్లక్ష్యం

సాధారణంగా వర్షాకాలంలో మురుగునీటి పారుదలకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు వేసవిలో పూడికలు తీసే కార్యక్రమాన్ని చేపడతారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడిచిన వేసవిలో తూతుమంత్రంగా పూడిక తొలగింపు కార్యక్రమాలను చేపట్టారని విమర్శలు వినిపిస్తున్నాయి. అందువలనే వర్షపునీరు బయటకు వెళ్లటానికి అధికంగా సమయం తీసుకుంటుందని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా డ్రెయిన్‌వీధి, సుబ్బరామయ్యవీధి, బీఆర్పీ రోడ్డు, గణపతిరావురోడ్డు తదితర ప్రాంతాల్లో పూడికలు తొలగింపు చేపడతారు. అందులోనూ అధికారులు చేతి వాటాన్ని ప్రదర్శించారని అందువలనే తూతూమంత్రంగా పనులు జరుగుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

నెలలు తరబడి పత్తా లేని ఎమ్మెల్యే

స్థానిక శాసనసభ్యులు సుజనాచౌదరి ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నెలకొకసారి, రెండునెలలకొకసారి నియోజకవర్గానికి వచ్చి కనిపించి వెళ్తున్నారే తప్పా వారి వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇటీవల ప్రమాదం పేరుతో చాలా నెలలుగా నియోజకవర్గానికే రాలేదని కూటమి పార్టీల నేతలు సైతం తప్పు పడుతున్నారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి ముంపు నివారణకు ఏమి చర్యలు చేపట్టారో చెప్పాలంటూ వామపక్ష నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రణాళికాబద్ధంగా ప్రసాదాల పోటు భవన నిర్మాణం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న ప్రసాదాల పోటు భవనంలో డ్రెయినేజీ వ్యవస్థ ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆదేశించారు. దుర్గగుడి మహా మండపం సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రసాదాల పోటును గురువారం దేవదాయ శాఖ కమిషనర్ పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో భవనంలోని సెల్లార్‌లో చేరిన వర్షం నీటిని పరిశీలించారు. కొండపై పడిన వర్షం నీరు సెల్లార్‌లోకి చేరకుండా భవనం చుట్టూ డ్రెయినేజీ కెనాల్‌ను ఏర్పాటు చేయడంతో పాటు భవనంలో డ్రెయినేజీ వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రసాదాల పోటు బిల్డింగ్ ప్లాన్‌ను పరిశీలించి డ్రెయినేజీ పైపులైన్ల ఏర్పాటు గురించి పలు సూచనలు చేశారు. ప్రసాదాల పోటు భవనం వెనుక భాగంతో పాటు ఉత్తర భాగంలో పనులను పరిశీలించారు. అనంతరం కనక దుర్గానగర్‌లో జరుగుతున్న వెలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, కనకదుర్గానగర్ నుంచి మహా మండపం వరకు నూతన బీటీ రోడ్డు, ఘాట్‌రోడ్డులో మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. దసరా ఉత్సవాలకు 10 రోజులు ముందుగానే నూతన భవనాలను ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలని ఆలయ ఈవో శీనానాయక్‌కు సూచించారు. కమిషనర్ వెంట దేవదాయ శాఖ సీఈ శేఖర్, దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, డీఈఈలు, ఏఈఈలు పాల్గొన్నారు.

విభజన సమయంలో రైల్వేది కీలకపాత్ర

డీఆర్ఎం మోహిత్ సోనాకియా



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దేశ విభజన సందర్భంగా లక్షలాది మంది ప్రజల కష్టాలను స్మరించుకుంటూ గురువారం డివిజన్ వ్యాప్తంగా 'విభజన భయానక సంఘటనల దినోత్సవం' నిర్వహించారు. విజయవాడ తూర్పు ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఆనాటి విభజన భయానక సంఘటనల ఫొటో ఎగ్జిబిషన్‌ను డీఆర్ఎం మోహిత్ సోనాకియా ప్రారంభించారు. అనంతరం డీఆర్ఎం మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా డివిజన్‌లో విభజన భయానక సంస్మరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. అప్పటి ప్రజలు అనుభవించిన బాధలు, త్యాగాలను గుర్తుచేసుకుంనేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో రైల్వే కీలక పాత్ర పోషించిందన్నారు. విభజన సమయంలో లక్షలాది మందికి సాధారణ రవాణా వ్యవస్థ నిలిచిందన్నారు. విభజన ప్రతికూల పరిస్థితుల్లో వారి అసమానమైన ధృడత్వం, ధైర్యం, ఐక్యత కారణంగా బలమైన దేశ నిర్మాణం జరిగిందని పేర్కొన్నారు. వారి త్యాగాలను తెలియజేసేలా డివిజయవాడతోపాటు డివిజన్ వ్యాప్తంగా ఫొటో గ్యాలరీలు, డిజిటల్ మ్యూజియం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు, పలు విభాగాల అధికారులు, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి



లోబ్రిడ్జి వద్ద కుంగిన రోడ్డు, గోడను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో వీఎంసీ ఏర్పాటు చేసిన అన్ని పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం ప్రకాశం బ్యారేజ్, హెచ్‌బీ కాలనీ, అజిత్ సింగనగర్, వన్‌టౌన్ లోబ్రిడ్జి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. లోబ్రిడ్జి వద్ద గోడ ప్రమాదకరమైన స్థితిలో ఉందని ఇప్పటికే పలుమార్లు చెప్పామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకొని వెంటనే ఆ మరమ్మతులు చేపట్టాలన్నారు. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరం, రిసెప్షన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ శిబిరాలకు వచ్చే ప్రజల నమోదుకు రిజిస్టర్ కచ్చితంగా పాటించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలని, లైట్లు, ఫ్యాన్లు, ఎలక్ట్రిసిటీ సంబంధిత వసతుల్లో ఇబ్బందులు కలగరాదని అధికారులను ఆదేశించారు.

నగరంలో 40 పునరావాస కేంద్రాలు

కొత్త రాజరాజేశ్వరిపేట కేర్ అండ్ షేర్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు ఉదయం టిఫిన్‌ను కమిషనర్ ధ్యానచంద్ర అందించారు. గురువారం నగర పరిధిలోని పునరావాస కేంద్రాల్లో 660 మందికి ఆహార సౌకర్యం కల్పించామన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా వారిని సురక్షిత ప్రదేశాలకి తరలించాలని చెప్పారు. నగరంలో ఉన్న 40 పునరావాస కేంద్రాల్లో లోతట్టు, వరద ముంపు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను వారి సమీపంలోని పునరావాస కేంద్రంలోకి తరలించి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. వరద నీరు లేబర్ కాలనీ నివాస స్థలాల్లో చేరుకున్న ప్రాంతాల్లోని వారికి ఇంటి వద్దనే ఆహారం అందజేయాలన్నారు. ఈ పర్యటనలో చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జె.శ్రీనివాస్, వి.శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.